సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఫలితమిస్తున్న గడ్డిక్షేత్రాలు
కవ్వాల్ టైగర్‌జోన్‌లో శాఖాహార జంతువుల సంతతి పెంపునకు అటవీశాఖ పెంచుతున్న గడ్డి క్షేత్రాలు సత్ఫలితాలిస్తున్నాయి. పులి వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి. 8లో▸

నేడు బోథ్‌కు హైకోర్టు జడ్జిల రాక
బోథ్: మండల కేంద్రానికి హైకోర్టు జడ్జిలు ఆదివారం రానున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు సుజన, వినోద్‌కుమార్, లక్ష్మణ్‌తో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు హాజరై బోథ్ జూనియర్ సివిల్ కోర్టు భవనంతోపాటు జడ్జి రెసిడెన్షియల్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు వసతిగృహాల్లో అనారోగ్యం బారిన పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తు, హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తోందని సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ భవనం వద్ద యూనియన్ ఆవిర్భావ స్వర్ణోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు స్వామి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను ఏకం చేస్తూ 1974 ఆగస్టు 10న టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. 50 ఏళ్ల ప్రస్థానంలో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. శాస్త్రీయ దృక్పథంతో విద్యావిధానం ఉండాలని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం తమదేనని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31 వరకు వివిధ అంశాలపై సెమినార్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, సూర్యకుమార్, కోశాధికారి కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంవీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: స్థానిక ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం సెప్టెంబర్ 1నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణకు రూ.15,600 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్ స్పెక్టర్ ఎస్.కె యూసఫ్‌ను 7382840349 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జైనథ్ ఆలయంలో కలెక్టర్ తల్లిదండ్రుల పూజలు



కలెక్టర్ తల్లిదండ్రులను సన్మానిస్తూ..

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ రాజర్షి షా తల్లిదండ్రులు శనివారం సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యం, విశిష్టతలు అడిగి తెలుసుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఇందులో డీటీ రాథోడ్ రాజేశ్వరి, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రోత్సాహం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: చిన్నారులకు ఆసక్తి గల కళల్లో ప్రోత్సాహం అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. మావల మండలంలోని శ్రీనవశక్తి దుర్గామాత పీఠం ఆవరణలో శనివారం నిర్వహించిన మువ్వల సవ్వడి కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. బాలకేంద్రం ఆధ్వర్యంలో నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు గజ్జలు, తాంబూలంకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులు వారికి నచ్చిన కళల్లో నైపుణ్యాలు మెరుగు పరుచుకునేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఇందులో నాట్య గురువు మిట్టు రవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గంజాయి కేసులో పట్టుబడ్డ తండ్రీకొడుకులను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

బోథ్‌లో ఓ చెట్టు పైన డబ్బాలో పెంచిన గంజాయి మొక్కలు (ఫైల్)



డబ్బాలో గంజాయి మొక్కలు ఇలా(ఫైల్)



ఇక్కడి సరుకే!

- ఈ నెల 9న ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రూపవాడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి శివారులో ఓ వ్యక్తికి గంజాయి విక్రయించే క్రమంలో అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. లక్ష 50 వేల విలువల గల 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 6న బోథ్ మండలం గుర్రాల తండా గ్రామానికి చెందిన తండ్రీకొడుకులైన చౌహాన్ దేవిసింగ్, గులాబ్‌సింగ్ గంజాయి విక్రయ కేసులో అరెస్టయ్యారు. వీరు గతంలో హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి గంజాయి విక్రయించగా అతడు తాజాగా అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడు. అతడు ఇచ్చిన సమాచారంలో రంగంలోకి దిగిన అక్కడి ఎక్సైజ్ ఎస్సై శివకుమార్ ఇక్కడికి చేరుకొని తండ్రి, కొడుకులను అరెస్టు చేశారు.
- ఈ నెల 3న బోథ్ మండలం సొనాల గ్రామంలో ఓంకార్ అనే వ్యక్తి వద్ద రెండు కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- గత జూలై 29న బోథ్ మండలం గుట్టపక్కతండా గ్రామానికి చెందిన హరిసింగ్‌ను కామారెడ్డి జిల్లా భిక్కనూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి హరిసింగ్ గంజాయి విక్రయించగా అతడు పోలీసులకు చిక్కడంతో గుట్టు రట్టయింది.

రెండు చోట్ల గంజాయి పట్టివేత
ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తుండగా ఉస్మాన్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి కాలనీలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఉస్మాన్‌ఖాన్ గంజాయి ప్యాకింగ్ చేసి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 920 గ్రాముల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లుగా సీఐ పేర్కొన్నారు.
టూటౌన్ పరిధిలో..
జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీకి చెందిన షేక్ ఖలీముద్దీన్ కుర్షీద్‌నగర్–గాంధీనగర్ కాలనీల మధ్య గంజాయి విక్రయిస్తుండగా, ఎస్సై విష్ణు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి గుడిహత్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన ముస్తాజీ సరుకు పంపిణీ చేసినట్లు విచారణలో తేలింది. అతడి నుంచి 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

- జిల్లాలో గుట్టుగా గంజాయి సాగు
- హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సరఫరా
- పలు ఘటనలతో కదులుతున్న డొంక..
- ఇతర జిల్లాల్లో పట్టుబడుతున్న ఈ ప్రాంతవాసులు
- తాజాగా పెరిగిన అరెస్టులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా గంజాయి సాగు, అక్రమ రవాణాకు అడ్డాగా మారుతోంది. ఇందుకు ఇటీవల పట్టుబడిన పలు ఘటనలే నిదర్శనం. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాలు ఉండటంతో కొంతమంది గుట్టుగా అటవీ ప్రాంతాల్లో ఈ సాగు చేపడుతున్నట్లు తెలుస్తోంది. మంచి ఆదాయం ఉండడంతో పలువురు ఈ అక్రమ దందాకు మొగ్గు చూపుతున్నారు. అమాయక రైతులకు ఆశచూపి సాగును ప్రోత్సహిస్తున్నారు. అనంతరం ఇక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు జాతీయ రహదారి ఆనుకున్న ఉన్న ప్రాంతాలకు సరఫరా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. అయితే ఇటీవల పలు జిల్లాల్లో గంజాయి పట్టుబడిన ఘటనల్లో ఇక్కడి వారే సూత్రదారులుగా ఉండడం గమనార్హం.

మూలాలు ఇక్కడే...
జిల్లాకు చెందిన కొంతమంది డబ్బు త్వరగా సంపాదించాలనే లక్ష్యంతో ఈ అక్రమ దందా ఎంచుకుంటున్నారు. ఇక్కడ సాగు చేసిన గంజాయిని హైదరాబాద్‌కు బ్యాగుల్లో తీసుకెళ్తున్నారు. అక్కడ వివిధ ప్రాంతాల్లో ఉన్న పబ్బుల వద్ద గల ఏజెంట్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీకెండ్, సెలవురోజుల సమయంలో కార్లు, బస్సుల్లో సరుకు రవాణా చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాలతో పాటు పలు మండలాల్లోని యువకులు హైదరాబాద్‌లో వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్‌గా పనిచేసే వీరంతా 18 నుంచి 30 ఏళ్లలోపు యువకులే. ఇక్కడ అంతరపంటగా సాగుచేసిన గంజాయిని అక్కడికి తీసుకెళ్లి విక్రయాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వారానికి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం ఉండడంతో దీనినే వారు ప్రధాన వృత్తిగా మార్చుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

గంజాయి విక్రయాలపై నిఘా పెంచాం



జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలపై నిఘా ఉంచాం. ఇప్పటికే 41 కేసులు నమోదు చేశాం. 150 కిలోల సరుకు సీజ్ చేశాం. ఇతర జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేసే చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే ఏజెన్సీ ఏరియాలో పర్యటిస్తాం. ప్రజలకు అవగాహన కల్పిస్తాం. గంజాయి సాగు, విక్రయాల విషయం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.
– గౌస్ ఆలం, ఎస్పీ

మీసేవ.. అందేదెప్పుడో?

- లబ్ధిదారుల ఎంపికలో జాప్యం
- ఆశావహులకు తప్పని ఎదురుచూపు
- యంత్రాంగం తీరుపై విమర్శలు



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం

కైలాస్‌నగర్: సర్కారు సేవలను పల్లెవాసులకు చేరువ చేయాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న వీటి నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని భావించింది. లబ్ధిదారులను సైతం ఎంపిక చేయాలని పేర్కొంది. ఇటీవల సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా సైతం త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మాత్రం ఈ విషయంలో జాప్యం చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

19 మీసేవ కేంద్రాలు మంజూరు
వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సంబంధిత సేవలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ చెల్లింపులు వంటి సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీసేవ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించింది. జిల్లాలో 18 మండల సమాఖ్యలున్నాయి. వీటికి గాను రూ.47.50 లక్షల వ్యయంతో 19 కేంద్రాలను మంజూరు చేసింది. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలిగా ఉండి ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన సభ్యులను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో చాలా మంది ఆసక్తి గల సభ్యులు వాటి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఎంపికలో తీవ్ర జాప్యం
లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆసక్తి గల వారి నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించారు. మండల సమాఖ్యల నుంచి తీర్మానాలు సైతం తీసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. 19 మీసేవ కేంద్రాలను జిల్లాలోని ఏయే మండలాల్లో ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేసిన డీఆర్డీఏ అధికారులు ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో ఆయన అనుమతి కోసం వాటిని సమర్పించారు. అయితే ఆ ప్రతిపాదిత గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేనట్లుగా కలెక్టర్ గుర్తించారు. వాటిని మార్చి పారదర్శక జాబితా సిద్ధం చేయాలని సూచించినట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏ గ్రామంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే దానిపై స్పష్టత లేకనే లబ్ధిదారుల ఎంపికలో వెనుకడుగు వేస్తున్నట్లుగా తెలుస్తోంది. అధికారుల వైఖరి ఎలా ఉన్నా దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా త్వరితగతిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



జిల్లాకు 19 మీసేవ కేంద్రాలు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంకా చేపట్టలేదు. తొలుత ఇంటర్మీడియెట్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారిని ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే మరోసారి రివైజ్డ్ మార్గదర్శకాలు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వాటి కోసం ఎదురుచూస్తున్నాం. మార్గదర్శకాలు విడుదలైన వెంటనే కేంద్రాలను ప్రారంభించే గ్రామాలతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.
– సాయన్న, డీఆర్డీవో

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఆదిలాబాద్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు శనివారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కాసేపు బ్యాటింగ్ చేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులు విధి నిర్వహణలో బిజీగా ఉంటారన్నారు. ఇలాంటి పోటీలు వారిలో ఉత్సాహం నింపుతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. ఇందులో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీళ జైన్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

ఉట్నూర్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండలంలోని శ్యాంపూర్ పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ రాథోడ్, సిబ్బంది ఉన్నారు.

మెరుగయ్యేనా..?

- పారిశుధ్య నిర్వహణపై బల్దియా ఫోకస్
- శానిటేషన్ విభాగానికి ముగ్గురు కొత్త అధికారులు
- వార్డులను మూడు సర్కిళ్లుగా ఏర్పాటు చేసి బాధ్యతలు
- క్షేత్రస్థాయిలో పెరగనున్న పర్యవేక్షణ

మున్సిపల్ పరిధిలో..
వార్డులు : 49
జనాభా : 1,80,390
కుటుంబాలు : 48393
ప్రతి రోజు సగటున పోగయ్యే చెత్త : 78 మెట్రిక్ టన్నులు
పట్టణ పారిశుధ్య కార్మికులు : 353 మంది



పట్టణంలోని డైట్ కళాశాల సమీపంలో చెత్తాచెదారం ఇలా..

కైలాస్‌నగర్: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య నిర్వహణే కీలకం. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయి. అయితే గ్రేడ్–1 ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ బల్దియాకు సవాలుగా నిలుస్తోంది. పట్టణ పారిశుధ్య పర్యవేక్షణ భారమంతా ఇటీవల వరకు ఒకే అధికారిపై ఉండటంతో క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించలేదు. పట్టణంలోని వివిధ కాలనీల్లో నమోదైన డెంగీ, విషజ్వరాలే నిదర్శనం. అయితే ఇటీవల చోటుచేసుకున్న ఉద్యోగుల సాధారణ బదిలీల్లో ఆదిలాబాద్ మున్సిపల్ పారిశుధ్య విభాగానికి ముగ్గురు కొత్త అధికారులు వచ్చారు. దీంతో బల్దియా పారిశుధ్య విభాగం పటిష్టంగా మారింది. క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలనే ఉద్దేశంతో 49 వార్డులను మూడు సర్కిళ్లుగా విభజించి వారికి బాధ్యతలు కేటాయించారు. ఈ నేపథ్యంలో పట్టణ పారిశుధ్య నిర్వహణ ఇప్పటికైనా మెరుగుపడేనా అనే చర్చ స్థానికంగా సాగుతోంది.

మూడు సర్కిళ్లుగా బాధ్యతలు
మున్సిపల్ పారిశుధ్య విభాగంలో మొన్నటి వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ ఒక్కరే ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కీలకమైన శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు భర్తీ అయింది. నిజామాబాద్ కార్పొరేషన్‌లో పనిచేసిన సాజిద్ అలీ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. మరో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బి.శంకర్, హెల్త్ అసిస్టెంట్‌గా పోశెట్టి కొత్తగా విధుల్లో చేరారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ మెరుగుపర్చాలనే ఉద్దేశంతో పట్టణంలోని 49 వార్డులను మూడు సర్కిళ్లుగా విభజిస్తూ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిస్థితిలో మార్పు వచ్చేనా...?
పేరుకే జిల్లా కేంద్రమైనా పారిశుధ్య నిర్వహణలో మాత్రం అధ్వాన పరిస్థితులున్నాయి. పలు వార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగక రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తడంపులు దర్శనమిస్తున్నాయి. పలు కాలనీల్లో డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి. దోమల బెడద పెరిగి ప్రజలు డెంగీ, విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలో దాదాపు అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో అధికారులు అందుబాటులోకి రావడం, కాలనీలను సర్కిళ్లుగా విభజించడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెరిగి పారిశుధ్య నిర్వహణ మెరుగయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే సదరు అధికారులు క్షేత్రస్థాయిలో రెగ్యులర్‌గా పర్యటించినప్పుడే ఇది సాధ్యపడుతుంది. లేకుంటే పాత కథే పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు.

సర్కిల్–1 : 5, 13, 14, 15, 16, 17, 32, 33, 34, 35, 36, 37, 42, 43, 44, 45, 47, 48, 49 వార్డులను నరేందర్‌కు కేటాయించారు.
సర్కిల్–2..: 1 ,2 ,3 ,4, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 46వ వార్డులను శంకర్‌కు అప్పగించారు.
సర్కిల్–3లో..: 6, 7, 8, 9, 10, 11, 12, 38, 39, 40, 41 వార్డులను హెల్త్ అసిస్టెంట్‌కు అప్పగించారు.
ఆయా వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణతో పాటు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఈ అధికారులపై ఉంటుంది. వీరిని శానిటరీ సూపర్‌వైజర్ పర్యవేక్షించనున్నారు.

ఘనంగా సిరాల్ పండుగ



పూజలో పాల్గొన్న భక్తులు

బజార్‌హత్నూర్: సిరాల్ పండుగను ఆదివాసీ ఆంద్ తెగకు చెందిన మహిళలు మండలంలోని బజార్‌హత్నూర్, ఆంద్‌గూడ, కొలారి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆంద్ తెగకు చెందిన ఆడపడుచులు ఏటా నాగుల పంచమికి పుట్టింటికి వస్తారు. తమ ఆచారంలో భాగంగా పంచమి తర్వాతి రోజు పుట్ట మట్టితో శివపార్వతుల ప్రతిమలు తయారు చేసి పూజలు చేయడం ఆనవాయితీ. అనంతరం భక్తిపాటలు పాడుతూ శోభాయాత్ర నిర్వహించారు. ప్రతిమలను గ్రామ సమీపంలోని నదిలో నిమజ్జనం చేశారు. తమ కుటుంబాలను చల్లంగ ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆంద్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ్, నారాయణ, సందీప్, కండోబా, దోండిబా, సీతారాం, బంటి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాగోబా ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగుల పంచమి సందర్భంగా నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని మెస్రం వంశీయులు శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,80,895, తైబజార్ ద్వారా రూ.28,060లు ఆదాయం వచ్చిందని ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఈ డబ్బులను ఖర్చు చేస్తామన్నారు. మెస్రం బాదిరావ్, కోసేరావ్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు, సోనేరావ్, వంశీయులు శేక్‌నాథ్, గ్రామస్తుడు కోట్నాక్ బారిక్‌రావ్ తదితరులు ఉన్నారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు

నేరడిగొండ: భార్యభర్తల గొడవలో భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొర్టికల్(బి) గ్రామానికి చెందిన తిత్రే అనిత–అశోక్ దంపతులు గత కొంత కాలంగా మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. అనిత ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుంది. భర్త అశోక్ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు మద్యం తాగి లేనిపోని వివాహేతర సంబంధాలు అంటగడుతూ అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు శనివారం ఇంట్లో వంట చేసే సామగ్రితో అనిత తలపై కొట్టడంతో రక్తస్రావమైంది. బాధితురాలి ఫిర్యాదుతో భర్త అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పేకాట స్థావరంపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొన్ని నెలలుగా గుట్టుగా సాగుతున్న పేకాటస్థావరాన్ని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో అశోక్‌నగర్ బస్తీలోని ఓ ఇంటిపై శనివారం దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరిలో ఓ మహిళ కౌన్సిలర్ భర్త ఉన్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.19,500 నగదు, 6 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ కోసం ఏడుగురిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

కోటపల్లిలో..

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి అటవీప్రాంతంలో పక్కా సమాచారంతో ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,34,750 నగదు, 3 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను సీజ్ చేశామన్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆగస్టు వర్షాలపైనే భారం!

- భారీ వరదొస్తేనే ఎస్సారెస్పీలోకి నీరు
- ప్రస్తుతం 47.25 టీఎంసీలు
- మహారాష్ట్రలోనూ వర్షాలు అంతంతే
- బాబ్లీ గేట్లు ఎత్తినా చేరని నీరు

ప్రాజెక్టు: శ్రీరాంసాగర్
పూర్తిస్థాయి నీటి మట్టం: 90 టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం: 47.25 టీఎంసీలు
గతేడాది నీటి మట్టం: 77.289 టీఎంసీలు



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

భైంసా: ముసురు వర్షంతో గోదావరి నది ఇప్పటివరకు ఉప్పొంగలేదు. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురియలేదు. గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న ఎత్తిన ఎస్సారెస్పీలోకి వరద నీరు అనుకున్నంత చేరలేదు. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో నిండనుంది. గతేడాది ఈ సమయానికే ఆరుసార్లు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈఏడాది ఒక్కసారి గేట్లు ఎత్తే పరిస్థితి రాలేదు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు కూడా ఎత్తలేదు.

ప్రస్తుత పరిస్థితి..

ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1080.80 అడుగుల నీటి మట్టం ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గతేడాది ఈ సమయానికి 77.289 టీఎంసీల నీరు నిలవ్వగా ఈసారి ఆ స్థాయిలో వరదనీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.05 ఉంది. లక్ష్మీ కెనాల్ ద్వారా 50, సరస్వతీ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఇక మిషన్ భగీరథ పథకంలో 231 క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ నుంచే పలు జిల్లాలకు రోజు పంపిణీ చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు 63 క్యూసెక్కులు, కోరుట్ల, జగిత్యాలకు 61 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డిలకు 107 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 43.569 టీఎంసీల నీరుచేరగా, ఇప్పటి వరకు 3.839 టీఎంసీల నీటిని బయటకు వదిలేశారు.

ఆ నాలుగు జిల్లాలో ఆయువుపట్టు

జిల్లాలోని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులన్నీ మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాగులు వంకలతోనే నిండుతాయి. ఈ నీరంతా ఉప నదుల నుంచి గోదావరిలో ప్రవహించి ఎస్సారెస్పీలోకి చేరుతుంది. ఎస్సారెస్పీ తెలంగాణలో ఉన్నప్పటికీ నది క్యాచ్‌మెంట్ ఏరియా అంతా మహారాష్ట్రలోనే ఉంది. ఔరంగాబాద్‌కు దిగువన పెద్ద ప్రాజెక్టులు లేకపోవడంతో మరట్‌వాడ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు వరదగా మారి ఎస్సారెస్పీ వైపు పరుగులు తీస్తుంది. ఔరంగాబాద్, జల్నా, పర్బనీ, నాందేడ్ జిల్లాల్లో కురిసిన వర్షాలే గోదావరి నదికి వరదను మోసుకువస్తాయి. ఈ ఏడాది మహారాష్ట్రలో గోదావరి ఉపనదులైన పూర్ణ, ప్రవరల పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురియలేదు. ఫలితంగా బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా భారీ వర్షాలు కురిస్తేనే బాసర వద్ద గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుంది.

ఎత్తిపోతలకు కష్టమే

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు సాగునీరందుతుంది. బ్యాక్‌వాటర్‌తో సరిహద్దు ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పెరుగుతుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంటేనే పంటలు వేసుకోవచ్చు. వర్షాకాలం మినహా వేసవిలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు ఎస్సారెస్పీ నుంచి సారంగాపూర్, కుంటాల మండలాల్లోని చాలా గ్రామాలకు నీటిని అందించేందుకు కాలువలు తవ్వించారు. దీని గుండా పొలాలకు పూర్తిస్థాయిలో నీరందే పరిస్థితి లేదు.

ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల

ప్రణాళికాబద్ధంగానే నీటిని వదులుతున్నాం. ప్రాజెక్టులో 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజువారీగా మిషన్ భగీరథ పథకంలో సాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్నాం. పంటల కోసం లక్ష్మీ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సరస్వతీ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం.

– చక్రపాణి, ఎస్సారెస్పీ ఈఈ

పిచ్చిమొక్కలతో జెడ్పీ ఉద్యానవనం



పరిసరాల పరిశుభ్రతతోపాటు పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అలాంటి ఆదిలాబాద్ జెడ్పీ కార్యాలయంలోని ఉద్యానవనం పిచ్చిమొక్కలతో నిండి అధికారుల నిర్వాకానికి నిలువుటద్దంలా నిలుస్తోంది. వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపించాల్సిన ఉద్యానవనం పిచ్చిమొక్కలతో నిండి ఉండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న మన్మోహన్, తదితరులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బీడీ మన్మోహన్ బాక్సింగ్ టోర్నమెంట్ పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బీడీ మన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఎంతోమంది ప్రతిభ ఉన్న బాక్సింగ్ క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాకు బాక్సింగ్ ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారులు నిఖత్ జరీన్, హుసాముద్దీన్‌లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవీందర్, టీబీఏ ప్రతినిధులు రవీందర్, బాల్ బహదూర్, కృష్ణ, శ్రీనివాస్, ఎల్లయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నల్గొండ, నిజామాబాద్ ప్రతినిధులు రవీందర్‌గౌడ్, షంషుద్దీన్, జిల్లా అధ్యక్షుడు విజయేందర్, శేఖర్, బేగ్, బాక్సింగ్ కోచ్ సాయి, జూడో కోచ్ రాజు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీంద్రనాయక్



గర్భిణితో మాట్లాడుతున్న రవీంద్రనాయక్

గుడిహత్నూర్: గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రికార్డులు, లేబర్ రూం, గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెయిటింగ్, ఫార్మసిస్ట్, వ్యాక్సిన్లు నిల్వ చేసే గదులను పరిశీలించారు. వ్యాక్సిన్‌లు నిల్వ చేసేందుకు కరెంట్ అవసరమని, సోలార్ బ్యాకప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై గర్భిణులు, సాధారణ రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో వసతులు, అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న సిబ్బంది, బదిలీల్లో ఖాళీ అయిన స్థానాల భర్తీ, ప్రస్తుత పరిస్థితి ఏమిటని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో హీటింగ్ సిస్టం, సోలార్ సిస్టం అత్యవసరమని వైద్యుడు శ్యాంసుందర్ ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్‌తో చర్చించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఎంహెచ్‌ఓ సాధన, ఎన్‌ఎస్‌డీ ప్రోగ్రాం ఆఫీసర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్ సూపరింటెండెంట్లు గోపి, శ్రీకాంత్, యునాని డాక్టర్ సదియా ఉన్నారు.

ఫలితమిస్తున్న గడ్డిక్షేత్రాలు

- గతేడాది జన్నారం డివిజన్‌లోనే 72 హెక్టార్లు
- ఐదేళ్లలో 900 హెక్టార్లు
- పెరుగుతున్న వన్యప్రాణుల సంఖ్య



జన్నారం డివిజన్‌లో గడ్డి మైదానం

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ 893 చదరపు కి.మీ విస్తీర్ణంలో కోర్ ఏరియా, 1123 చదరపు కి.మీలో బఫర్ ఏరియా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాన్ని 2012లో కేంద్రం టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. అప్పటినుంచి పులుల రాకపోకలే తప్ప ఇక్కడ అవాసం ఏర్పాటు చేసుకున్న దాఖలాలు లేవు. శాఖహార జంతువుల సంతతి పెంచి, టైగర్‌జోన్‌లో పులి అవాసం ఏర్పర్చుచుకునేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అడవిలో వన్యప్రాణుల సంఖ్య అనేది ఆవాసాల్లో విస్తరించి ఉన్న గడ్డిక్షేత్రాల సాంద్రతపై ఆధారపడి ఉంటుంది. కనీసం పది శాతం గడ్డిక్షేత్రాలు విస్తరించి ఉంటే శాఖహార జంతువుల సంతతి పెరుగుతుంది. ఈ క్రమంలోనే పులి వచ్చే అవకాశాలు మెండుగా ఉంటుందనేది అధికారులు యోచన.

అధికారులకు శిక్షణ

గడ్డిక్షేత్రాల పెంపకంతో జింకలు, దుప్పులు, సాంబర్లు, నీలుగాయిలు, కొండగొర్రెలు, అడవి దున్నలు, గడ్డిజింకలు, ఇతర వన్యప్రాణులు ఆధారపడి జీవిస్తాయి. పులులు, చిరుతపులులు, నక్కలు, అటవీ కుక్కలు, తోడేళ్లు ఆధారపడుతాయి. గడ్డిక్షేత్రాల పెంపకంపై అధికారులకు జన్నారంలో మహారాష్ట్రకు చెందిన నిపుణుడు డా.జీడీ మురత్కర్ 2018లో శిక్షణ ఇచ్చారు. సహజ గడ్డిక్షేత్రాలు, విత్తనాల సేకరణ, ముళ్ల కంచెల తొలగింపు, కలుపు మొక్కల నివారణ, గడ్డి విత్తనాల నిల్వ సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. అప్పటినుంచి ప్రారంభమైన గడ్డి క్షేత్రాల పెంపకం ప్రస్తుతం ఫలితాలిస్తోంది.

2018 నుంచి పెంపకం

2018 నుంచి కవ్వాల్ టైగర్‌జోన్‌లో గడ్డి క్షేత్రాలు పెంపకానికి శ్రీకారం చుట్టింది. 2023 వరకు 900 హెక్టార్లలో ఈ క్షేత్రాలు పెంచారు. దేశంలోని పలు టైగర్ జోన్ల అధికారులు గడ్డిక్షేత్రాల పరిశీలనకు జన్నారం రావడం విశేషం. వీటి నిర్వహణ, చేపడుతున్న చర్యలు, వన్యప్రాణులకు ఇష్టమైన గడ్డి తదితర అంశాలపై అవగాహన పొందారు. కొన్ని ప్రాంతాల్లో గడ్డి విత్తనాలను చల్లి సహజసిద్ధంగా గడ్డిని పెంచుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సహజసిద్ధంగా మొలసిన గడ్డి చుట్టూ కంచె వేసి, కలుపు తొలగిస్తూ పెంపకం చేస్తున్నారు.

జన్నారం అటవీ డివిజన్‌లోనే 72 హెక్టార్లు

రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం వంద హెక్టర్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేయగా అందులో 72 హెక్టార్లు జన్నారం అటవీ డివిజన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏడాది తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి మూడు రేంజ్‌ల్లో కలిపి 172 హెక్టార్లు గడ్డి క్షేత్రాలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య రెట్టింపు అయింది. ఖానాపూర్, ఉట్నూర్, జన్నారం, ఆసిఫాబాద్ అటవీ డివిజన్లలో 300 హెక్టార్లలో పెంచాలని ఆదేశాలు ఉన్నాయి.

గడ్డి మైదానాలు పెంచుతాం

విరివిగా గడ్డి మైదానాలు పెంచడం వల్ల వన్యప్రాణుల సంఖ్య పెరుగుతుంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో 300 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని డివిజన్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– శాంతారాం, ఎఫ్‌డీపీటీ

సిరాల్ ఉత్సవాలు




మహిళల సంప్రదాయ నృత్యం




పూజలు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: శ్రావణమాసంలో నాగుల పంచమి మరుసటి రోజున నిర్వహించే సిరాల్ ఉత్సవాలను అంద్ ఆదివాసీ తెగకు చెందిన మహిళలు మండలంలోని గ్రామాల్లో శనివారం నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పుట్ట మట్టిని గ్రామపెద్ద ఇంటికి తీసుకువచ్చి సిరాల్ దేవతలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సంతనం లేని వారికి సంతన ప్రాప్తి కలగాలని, పంటలు పండాలని సిరాల్ దేవతకు మొక్కినట్లు ఆంద్ ఆదివాసీ పెద్దలు తెలిపారు. అనంతరం సిరాల్ విగ్రహాలను ఊరేగిస్తూ మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి పూజలు చేసి వాగుల్లో వదిలేశారు. గ్రామపెద్దలు ముఖడే విష్ణు, ముఖడే ఉత్తం, గారుశే దశరథ్, బాలాజీ తదితరులు ఉన్నారు.

సీపీ గేట్ ఫలితాల్లో ప్రతిభ



రమాతాయి, విఠల్



ఇంకేసర్ ఆలం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సీపీ గేట్ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. 2021–24 బ్యాచ్ విద్యార్థి ముండే విఠల్.. సీపీ గేట్ ఫలితాల్లో ఏకంగా మూడు సబ్జెక్టుల్లో ర్యాంకులు సాధించి సత్తా చాటాడు. ఎంఏ హిందీలో 2వ ర్యాంకు, ఎంఏ ఎకనామిక్స్‌లో 9వ ర్యాంకు, హిస్టరీలో 108వ ర్యాంకు సాధించాడు. సీయూఈటీ(పీజీ)–కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్–2024 సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో కర్ణాటక సీయూలో ఎంబీఏ సీటు సాధించడం విశేషం. కళాశాలకు చెందిన మరో విద్యార్థి ఇంకేసర్ ఆలం..ఎంఏ ఎకనామిక్స్‌లో 23వ ర్యాంకు సాధించాడు.

అక్కాతమ్ముళ్ల అదుర్స్

గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామానికి చెందిన ముండే విఠల్ అక్క రమాతాయి గత సంవత్సరం జరిగిన సీపీ గేట్ ఫలితాల్లో ఎంఏ హిస్టరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ఎంట్రెన్స్ లో జాతీయస్థాయిలో 85వ ర్యాంకు సాధించి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సంపాదించింది. అక్కా తమ్ముళ్లు సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందడం పట్ల తల్లిదండ్రులు దొండిరామ్–సుమిత్రలకు పలువురు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ జలగం అనిత, అధ్యాపకులు సంతోష్ కుమార్, కోటయ్య, స్వప్న, నందిని, పృథ్వీలు విద్యార్థులను అభినందించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

తాంసి: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై కలీం కథనం ప్రకారం..మహారాష్ట్రలోని ఘటాంజి గ్రామానికి చెందిన సారజీ(38), రవి భార్యభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సారజీ తన కుటుంబంతో కలిసి భీంపూర్ మండలం నిపాని గ్రామంలోని అక్క రాథోడ్ రుక్మా వద్ద గత కొన్నేళ్లుగా ఉంటుంది. సారజీ భర్త రవి గత మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. భర్త వేధింపులు తాళలేక సారజీ శనివారం ఉదయం వడ్గాం శివారు చేనులో చెట్టుకు ఉరేసుకుంది. గ్రామస్తులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతురాలి సోదరి రాథోడ్ రుక్మా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి..

కడెం: గత నాలుగేళ్ల క్రితం అమ్మానాన్నలు, రెండేళ్ల క్రితం అన్న మృతిచెందడంతో జీవితంపై విరక్తితో గుర్తు తెలియని పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భీంరావు కథనం ప్రకారం.. కడెం మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన గొట్టం రాకేశ్(21) గతనెల 31న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి, నిర్మల్ ఆసుపత్రికి పంపించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజు(42) రిమ్స్‌లో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. రాజు గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఈనెల 8న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రిమ్స్‌లో ఇద్దరు మృతి..

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం ఇద్దరు మృతి చెందారు. టూ టౌన్ ఏఎస్సై ముకుందరావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా మాలే బోరిగావ్ గ్రామానికి చెందిన కరహాలే పరమేశ్వర్ (22) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 6న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదేవిధంగా మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకాకు చెందిన గురునులే శ్రీరామ్(55) పంట చేనులో పురుగుల మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై, రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీరామ్ భార్య లక్ష్మిప్రియ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామ సమీపంలో నిర్మల్–భైంసా రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. ముథోల్‌కు చెందిన సాయినాథ్ తన కిరాణా సామగ్రి కోసం ఆటో తీసుకుని నిర్మల్‌కు వచ్చాడు. కొనుగోలు అనంతరం తిరిగి వెళ్తుండగా అతి వేగంగా నిర్మల్ వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. ఆటో డ్రైవర్ జాదవ్ వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జ్వరంతో వివాహిత మృతి



రోషిణి మృతదేహం

కాసిపేట: జ్వరంతో బాధపడుతున్న వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన రోషిణి (24), కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన ముక్కెర వెంకటేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. కులపెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించి ఇద్దరు కలిసి ఉండాలని సూచించారు. గురువారం రోషిణికి జ్వరం వచ్చింది. భర్త ఆమెను శుక్రవారం బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తుండగా ఫిట్స్ రావడంతో రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కాగా, కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో చోరీ



ఎల్లమ్మ గుడిని పరిశీలిస్తున్న పోలీసులు

కుభీర్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం రాజగౌడ్ వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. గుడిగంట, సిలిండర్ ఎత్తుకెళ్లారని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. పాంగ్రా గ్రామం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా మహేశ్ తురాఖాన్‌ను బైక్‌పై వెళ్తుండగా తనిఖీ చేయగా గుడిగంట, సిలిండర్ లభించింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆస్పత్రిలో టోకెన్ నంబర్ తీసుకునేందుకు ఈనెల 9న చుక్కల విఠల్ బస్సులో నిర్మల్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బయటకు వస్తున్న ఆయన్ను గమనించిన రాపాని శ్రీను, వేముల సుజాత, రాజమణి అడ్డగించారు. అతని మెడలో 6 గ్రాముల బంగారు గొలుసు, జేబులో రూ.950 నగదు, సెల్‌ఫోన్ దోచుకొని పారిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ గంగారెడ్డి సహాయంతో బస్టాండ్ ఏరియాలో ఇద్దరు దొంగలను శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.950 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ పేర్కొన్నారు.